# కాలు జారిన కమల

## అమ్మ

ఏమిటో, దీని వాలకం చూస్తే గుండె జారిపోతోంది. నాలుగు రోజుల్నుంచీ చూస్తున్నానుకదూ, తెల్లారుజామున లేవడం ఆ నూతి పళ్ళెందాకా ఆదరాబాదరా పరుగెత్తడం, వాంతి చేసుకోడం, అటూ ఇటూ చూసి రెండు బకెట్ల నీళ్ళు పోసి కడిగేసి రావడం. తెల్లవారుజామునే లేచేవేమో అంటే ఈ మధ్య అలాగే లేస్తున్నానమ్మని దులిపేసింది. నూతిదగ్గ రేం చేస్తున్నా వంటే కాళ్ళూ చేతులూ కడుక్కున్నాను. కనిపించలేదా అని విదిలించేసింది. ఇంకెంతకి వాడిగట్టి ఉంటుందో! — అలాంటివాళ్ళు బొంక నేరుస్తారుట కూడానూ! శివశివ, ఏం గతి, ఏం దిక్కు!— ఆ రామేశంగాడు ఒచ్చివెళ్ళి రెణ్ణెళ్లే సరిగ్గా అయింది గాని, ఏదీ?— అసలు ఇది, వాణ్ణే—నా, అనీ?— ఈ మహాపట్నంలో ఏ నూకేశ్వర్రావుని వలచిందో, ఎవడికి తీసికెళ్ళి దీన్ని కట్టబెట్టాలో!— ఇంతకీ దీన్నని ప్రయోజనం లేదు! నెత్తి కెక్కించుకున్నారు, ఆయన్ననాలి! పెద్ద లెక్చర్లు, మళ్ళీనూ! తల్లీ నువ్వు నా కూతురువీ నేను నీ తండ్రినీ అనుకోడం స్వార్థం; మనమంతా భారతమాత సత్సంతాన మని పాఠం చెప్పేరు. స్వయం బుద్ధికి మించిన వేదం లేదని వేదాంతం చెప్పేరు. దాని

స్వయం బుద్ధితో అదెంచుకున్న మొగుడికి ఈయనగారు కాళ్ళు కడగడానికి కన్యాదానం చెయ్యడానికి సిద్ధమే గాబోలు!— ఇంకా పెరటిదార్లో వున్నాను; ఇది క న్యేమిటి, నా మొహం! అంతా రాత! అసలాయనగారు ఎవడో, వాడి కుల మేమిటో, గోత్ర మేమిటో, వాడి కెంతమంది పెళ్ళాలో, పిల్లలో! ఏం దారి భగవంతుడా! ఈయనగారి కేమీ పట్టదు; ఏమఁడీ అమ్మాయి వరస చూసేరా, యెంత యిదిగా ఉందోనని తను అంటే కూడా నవ్వేసి ఊరుకున్నారు! ఎంతో యిదిగా చెవిలో యిల్లు గట్టుకు చెబితే, ఓహో అలాగా, నిజమే నంటావా? — సరే చూదాంలే — నే నలా వెళ్ళొస్తాను, రేపాలోచిద్దాం! అంటారు కద! — ఈ వ్యవహారం ఎలా తేల్చడం?— ఏం చెయ్యడం? ఎవరి సాయం లేకుండా ఏం చేస్తాను, ఒక్కర్తెని! కోడళ్ళిద్దరూ చూస్తే ఈ యింటి గౌరవంమీదా, ఈ వంశ మర్యాదమీదా ఏమీ నమ్మకం అభిమానం లేనివాళ్ళు! వాళ్ళకిగాని ఈ సంగతి తెలిస్తే ఇహ ఎవరూ రేడియోలు పెట్టుకోరు!

● ● ●

## నాన్న

ఈ రోజు రెండుపూట్లా అజ్జర్వ చేయించింది శాంత, కమల ఆహార విహారాలు... శాంతదేదో వ్యర్థ అనుమానం అనుకొని నిర్లక్ష్యం చెయ్యడం పొరపాటే. ఏమీ సయించదంటూ కమల మరీ పిచ్చుకగిన్నట్టు తిన్నది. వేళగాని వేళప్పుడు రంగణ్ణి పంపి టిఫిన్ తెప్పించుకొంది—ప్రారంభదశలో యిలాగే వుంటుందని శాంత చెబుతోందిగా! ఆకలేసినట్టుండకపోదం, చిరుతిళ్ళమీద వ్యామోహం; ఇవన్నీ మరి శాంత చెప్పినట్టు ఆ లక్షణాలే! — తల్లిమనసు ఎంత ఇదవుతూందో ఎలా చెప్పడం! — తను నమ్మక, రుజువులడిగీ,

ఆమెని మరింత అయాసపెట్టేడు. ఈ నాలుగు మూడు రోజులూ ఇలా వ్యర్ధపరచక దీసికి సొల్యూషన్ ఆలోచించినా బాగుణ్ణు.

కమలస్థితి చూస్తే జాలివేస్తుంది. ఎలా తొందరపడిందో, పాపం! చాలా నిదానం గలదీ, చిన్న విషయాల దగ్గిర్నుంచీ ఆలోచించేదిన్నూ. అలాటిది ఇంత పెద్ద విషయంలో ఎలా తొందరపడి కాలు జారిందో!—ఆ వయస్సటువంటిది. ఆవేశం, ఉద్రేకం గాలి తాకిడితిన్న మేఘాల్లా ఆక్రమించుకుంటాయి మనస్సుని. అంతా చీకటై ఆలోచనా జ్యోతి ఆరిపోతుంది. ఇంత చదివి, ఇంత సంస్కారం పొంది, ఇలాంటి యింట్లో పెరిగిన కమలే యిలా అయితే యింక సామాన్యుల మాట చెప్పాలా?

బుజ్జగించి అడగాలి కమలని. తొందరా కోపం చూపిస్తే దాని ఆత్మగౌరవం దెబ్బతిని ఇంకో తొందరపాటు పని చేస్తుంది. తెలిసీ తెలియని వయస్సు; చిరాకెత్తి ఏ నూతికో గోతికో దారి తీసినా తియ్యొచ్చు. లేదా పాయిజన్ ఉండనే ఉంటుంది—ఈ తప్పుద్వారా ఆమె నొక పాఠం నేర్చుకొనేటట్టు చూడాలిగాని ఇంకోతప్పు చేసేందుకు ప్రోత్సహించ కూడదు. శాంత అనేలాంటి మాటలు కాక, శాంతవచనాల్తో అమ్మాయినుంచి విషయం సేకరించి, ఏ డాక్టరమ్మనో పిల్చి స్నేహం చేయించి, స్నేహంద్వారానే అంతా రైట్ చేయించాలి... అసలు పిల్చి సంగతి కనుక్కుంటే—? — ఓహో — ఈ వేళప్పుడు రీడింగ్ రూమ్‌లో ఉంటుంద గాబోలు—చిక్కొచ్చి పడ్డది. నాలుగురోజులు రీడింగ్ రూమ్ మానెయ్యమ్మా అనడాని క్కూడా వీల్లేదు. పదేళ్ళ పిల్లగా ఉన్నప్పటి అలవాటు, అది!— రీడింగ్ రూమ్ దగ్గిరెవరికైనా తెలుసో యేమిటో, కొంపదీసి!— ఛా, ఇదేమిటి, నేనూ శాంతలాగే భయపడుతున్నాను!—ప్రైవేట్ కరెక్ట్!—ఇలాంటి వాట్లో ఫెమినైన్ ఇన్‌ఫ్లూయెన్స్ తప్పదు, ఎంతవాడికైనా!

'ఇంతకీ శాంత చెప్పినట్టు రామేశంగాడో, లేక మరెవడో—అబ్బ!—మళ్ళీ శాంత ఇన్‌ఫ్లూయెన్స్!

● ● ●

## చిన్న వదినె

జానకక్క ఏమిటో, వెర్రిబాగుల్ది, కపటంలేని మనిషి — కమలని సమర్థించడానికే చూస్తోందిగాని—నాకు; తెలీదూ? ఇది అక్షరాలా అదే! నీకేం తెలుసు చెప్పూ అంటే, చెప్పడానికి వీలా? చూసింకీ గుర్తు పెట్టుకుందీ అది! లోగడ చిన్నాన్నగారి సీతక్కయ్యా ఇంతేకద!—కమల మాత్రం మనిషి కాదూ? తెలివిగా ప్రవర్తించి అకార్యాలు చేస్తేమట్టుకు ఫలితం దగ్గర కొచ్చేసరికి అందరూ వొక్కటే.

అదే మరి, ఈ పట్నవాసం వాళ్ళతో విడ్డూరం! పెళ్ళికాక ముందే ఇలాటిదేదో అవడం పెద్ద ఆశ్చర్యంలేదు!—మేనత్త కొడుకే అవుగాక, అయితే మట్టుకు అంత యిదిగా వుండాలటమ్మా అంటే; ఆ మాత్రం నాకు తెలీదా ఒదినా అని దులిపేసుకుంది! ఆ పకపకలూ, ఆ రాసుకు పూసుకు తిరగడాలూ! కలిసే ఎక్కడికెళ్ళినా! రాత్రి పొద్దుపోనీ, అందరూ ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోనీ, వీళ్ళిద్దరూ కబుర్లూ కకవికలూ మానలేదే! లక్షణంగా పెళ్ళిళ్లు చేసుకున్నాసరే, సిగ్గు సిగ్గు—అర్ధరాత్రయి అందరూ మాటుమణిగేదాకా మొగుళ్ళతోటయినా మాట్లాడని మేం ఎక్కడ, తక్కుతూ, తారుతూ, వేళ్లుతాకందీ పుస్తకమన్నా చేతబట్టని ఈ కమలెక్కడ!—పైగా ఊరంత పొగరు! మదం అలా చేస్తుంది! ఇంతకీ తను ఏమన్నది గనక!—అలా నోరు చిరాగ్గా ఉంటే కొంచెం పుల్లటి దేదేనా నోట్లో వేసుకోవాలమ్మా, పదేపదే చిరుతిళ్లుతింటే మంచిదిగాదు, అన్నది—దానికి అంతెత్తున లేచి—నాకేం

వేసేశ్ళనుకున్నావా ఒదినా, అవేమిటా మాటలు? అంది!—తను నిదానమైన మనిషి గనక—నవ్వేసి – అదంతా యిప్పుడనుకోడం దేనికిలే—అనేసింది – లేకపోతే పెద్ద తగువే అయిపోయేది!—ఈ యింటి పరువూ, మర్యాదా, ఇలాంటి తగువులతో వీధిన పడేదే! మామగారి మొహం, అత్తగారి మొహం చూసి అలా గడుపుకొస్తున్నారుగాని, తనూ, జానకక్కాన్నూ, లేకపోతే ఎంత సేపు!—గుట్టుగా ఉండి మంచిగా ఉండడం ఈవిడ కెందుకు చాత కావడం లేదో మరి, ఆ తల్లిదండ్రుల బిడ్డ, మళ్ళీనూ!

• • •

## కమల

చాలా బాగుంది; అయితే ఇదన్నమాట, ఈ గుసగుసల గుసగుసల సారాంశం! అసలు ఇంత బ్రహ్మాండమైన ఆలోచన, ఈ అనిమిష నిర్ణయం ఎవరిదో! కలిగితే అమ్మకి, కాకపోతే చీమ మిరపకాయ ఆ చిన్న వదినెగారికీ కలిగుండాలి!—అమ్మ అయితే తొందరపడి అందరితోటీ చెప్పెయ్యదు; ఇది నిశ్చయంగా చిన్న వదినెగారి ఐడియావే అన్నమాట. అవిడగారే, ఓసారి తను నూతి పళ్ళెం దగ్గర వాంతి బకెట్‌తో కడిగేస్తూ వుంటే, మేడమీది గది కిటికీ దగ్గర నిలబడి పెద్దగా దగ్గి, నే చూశాములే, అన్నట్టు పోజు పెట్టింది—సిగ్గులేని ఆలోచన చేసినందుకు బుద్ధి గడ్డితిన్నట్టు నోరు మూసుకు కూచోక, తగుదునమ్మా అని, ఏమిటి ఒదినెగారూ, ఒంట్లో యెలా వుందంటూ పలకరింపులు మొదలెట్టింది! నోరు కొంచెం అరుచిగా ఉన్నట్టుందమ్మా, అన్నం సయించడం లేదని యథాలాపంగా తను అందో లేదో; కొంచెం వుల్లటి

...దనా తినాలి; ఇలాంటి రోజుల్లో చిరుతిళ్లు కూడా విరివిగా తినడం మంచిదిగాని సలహాలు ప్రారంభించింది.

బలే బాగుంది, వీళ్ళ అనుమానం! — సింపుల్ అరిథ్‌మెటిక్! రామేశం బావ వచ్చివెళ్ళి రెణ్ణెల్ల పైగా అయింది. అప్పుడు నేను లైబ్రరీకైనా వెళ్ళకుండా నాన్నతో షికారూ వెళ్ళకుండా అరరోజులూ బావతో గడిపాను! బావ ఢిల్లీనించి రాక రాక రావడం, ఏవో విశేషాలు చెప్పడం, ఆ ప్రవాహంలోపడి వేళలు మరిచిపోడం — పైగా బావతో తిరగడం. ఎప్పటికన్నా ఓవర్ డోన్ అయిందని అప్పుడే అనిపించేసింది, నా మట్టుకు నాకే! (ఇవి చూసేవాళ్ళ కనిపించడంలో వింతేముంది?) — పైగా సరిగ్గా ఎక్స్పర్షను వచ్చిపడింది, పదిహేను, పదహారు, పదిహేడు తేదీల్లోనే! అట్నుంచి రాగానే అమ్మ ఏమే వాకిట్నున్నావే అని అడిగింది, పాపం; తనే — ఛీ పొమ్మా, పోసుకోలు ప్రశ్నలూ నువ్వూనూ! అని విదిలించేసింది తను! ఈ నెల యింకా పదమూడేగా యివ్వాళ! — చాలా బాగుంది. మోస్ట్ లాజికల్.

వీళ్ళకి తగినశాస్తి చెయ్యాలి. ఇలాగే భయంలో, ఆందోళనలో, అనుమానంలో, ఆవేదనలో పెడితేసరి! ఇవాళో రేపో బయల్దేరి — ఏం లేదు, సరళని చూసొస్తానని వెళితేసరి? — ఐదారోజులు వుండిరావచ్చు — అక్కడ రామేశం బావ ఉన్నాడో యేమిటో — ఉంటే వాళ్ళింటికి రాబోయాడా ఏం! — అసలు ఇదంతా రామేశం బావ వింటే చాలా ఎమ్యూజ్ అవుతాడు. వెళ్ళి చెప్పాల్సిందే కూడా! — అంతే! — సరళని చూసొస్తానని నే బయల్దేరగానే నేను రామేశం బావకోసం పరుగెత్తాననుకొని మరి గట్టిపడుతుంది వీళ్ళ నమ్మకం. అట్నుంచి రాగానే కొంచెం పాథోస్ యాక్ట్‌చేస్తే ఇంకా బాగుంటుంది. బావ డిజపాయింట్‌మెంట్ చేసేడనుకొని — ఏం చేస్తారో, చూడాలి, వీళ్ళందరూ కలిసి!

పెద్దన్నయ్య ఇవాళే బయలుదేరి విజయవాడ వెళ్ళేడు. ఎందుకనో!— ఎందుకనో ఏమిటి? ఇదంతా చెప్పి అత్తయ్యతో పెళ్ళి సంగతి మాట్లాడాలని అయివుంటుంది. అంతకన్నా అర్జంటు పనేముంటుంది ప్రస్తుతం, వెళ్ళకి! అబ్బాయీ అమ్మాయీ తొందర పడ్డారు. ఏదో నలుగురి నోళ్ళలోనూ పడకముందే గబాల్న ముహూర్తం పెట్టి ఆ మూడు ముళ్ళూ వేయిద్దాం అని యూక్లిడ్ మార్కు డైలాగు చెబుతాడు గాబోలు. ఆ మీద బావా అత్తయ్యా కన్సల్ట్ చేసుకొని ...ఏమంటారో! చూస్తే బాగుణ్ణు. ఛీ అంటారు, ఛా, అంటారు— మామూలప్పుడే అత్తయ్య గడుసుది: వీళ్ళు పల్టీలు కొడతారు. ఇప్పుడు ఆవిడతో మాట్లాడగలుగుతారా?— చూడగలిగితే బాగుణ్ణు ఆ దృశ్యం!... ఎలా?—ఈపాటికి అన్నయ్య మాట్లాడేసి ఉంటాడేమో!

• • •

## పెద్దన్నయ్య

పాపం, అత్తయ్య కట్నం కోసం ఆగిందిగాని సంబంధం ఇష్టం లేక కాదు!—ఏదో, మరి నాలుగు మాట్లు అడిగించుకొని వాయిదా వేస్తే మరో నాలుగు వందలేనా కిడతాయని గాబోలు! స్వయం సంపాదనా, మేనేజిమెంటూ మొదలెట్టి పదేళ్ళు దాటింది పాపం; ఆమాత్రం డబ్బు కాపీనం ఉండడం చాలా సహజం!—నాన్నఎప్పుడూ కట్నం గురించి వెనుకాడలేదు గాని—నొక్కంది మామిడిపండులోంచి కూడా రసం రాదన్న థియరీ ప్రకారం — సహజంగా డబ్బు యిచ్చే గుణం వున్న నాన్ననికూడా ప్రెస్సింగ్ మొదలు పెట్టింది.—తీరా సంగతి యిదీ, కుర్రాళ్ళు కక్కుర్తిపడ్డారూ, అని తెలియగానే పతక

నలసింది కారణాలూ వాయిదాలూ కాదు: ముహూర్తమూ కార్యమూ అని వెంటనే గుర్తించింది!—ఇంత తొందరపడతా రనుకోలేదుట—ఎవరుమాత్రం అనుకున్నారు! ఆవిడగారు ఉత్తుత్తి వాయిదాలు వెయ్యనూ, వీళ్ళు మరి కొన్ని రోజులు హుషారుగా వుండనూ!

సరే రెండుమూడురోజుల్లో వొస్తాం నేనూ అబ్బాయీనీ; వాడు శిస్తులు వసూలు చేసుకురాడానికి వెళ్ళేడు: యివాళే మనిషిని పంపుతాను, నువ్వెళ్ళు, అని సాగనంపింది అత్తయ్య!— కమల్ని ఎక్కడికీ తిరగనియ్యకండిరా బాబూ అని అత్తయ్య కాళ్ళావేళ్ళా పడుతూఉంటే, తనకి చెప్పరాని సిగ్గూ అనుకోరాని ఆశ్చర్యమూ వేసేయి. ఎక్కడి అత్తయ్య. ఏనాటి ప్రొపోజల్: ఏం వాయిదాలు, ఎట్లాంటి పరిష్కారం! — మార్వెలస్!

• • •

## కమల

ఛీ ఛీ — ఇంత ట్రాజెడీ అవుతుందనుకోలేదు. సరిగ్గా స్టేషన్లోనే అన్నయ్య పట్టేసుకున్నాడు. టిక్కెట్టెక్కడికో చూణ్ణీఅన్నాడు. బెజవాడ అనేసరికి, ఎవరింటికి ఇప్పు డర్జంటుగా! అని కోపం ఎగతాళీ కలిపి అడిగేడు. సరళని చూసొస్తా నన్నయ్యా అంటే నాకు తెలుసు, నువ్వు సరళని చూడ్డానికి వెళతావని! అని గదిమేడు — సాయింత్రం వెళుదువుగాని వెనక్కిపద, అని నడుంమీద చెయ్యేసి లాక్కొచ్చేశాడు. పాపం, అన్నయ్యకేం తెలుసు! నన్ను ముట్టేసుకున్నాడు. ఇదంతా తీసుకెళ్ళి ఇంట్లో కలిపేస్తాడుగాబోలు! ఛా! —

చెప్పెయ్యనా అంటే అదీ బాగులేదు! ఇంటికిరాగానే మేడమీది గదిలోకి తిన్నగా లాక్కెళ్ళిపోయాడు. దండకం ప్రారంభించేడు. వంశం గౌరవం — నీతి, నియమం ఏంకుంటో చెప్పేడు. ఇవాళ బావదగ్గిర తొందరపడ్డావు రేపు ఇంకెక్కడేనా తొందరపడితే మే మెల్లా బ్రతకం! అన్నాడు. పైగా దేహస్థితి ఏమిటో దానికి పథ్యం ఏమిటో తెలుసుకోక ఊళ్ళమ్మట బలాదూరు తిరుగుతున్నావట — ! అంతా అయిపోయాక ఇంట్లో ఎవ్వరూ కూడా అనడానికి సాహసించని మాట అన్నందుకు తాను నా అన్నయ్య కాదనీ రాక్షసుడనీ కటికవాడని అనుకోమంటాడు. ఎలా అనుకున్నా తను చెప్పిందాట్లో నిజం గ్రహించు ఇలాచేస్తే అదే తనకి పదివేలుట... బల్లమీద నే రాసిపెట్టిన ఉత్తరం చూసి అగ్గి బుగ్గి అయిపోయాడు. దొంగపని చేసేనుకనకే యీ పరారయిపోడం అని కరుగ్గా యెగతాళి చేసేడు. అలా కరుగ్గానే నా కొక నమస్కారం చేసి — తల్లీ మమ్మల్ని క్షమించి అత్తా రామేశం బావా వచ్చేవరకయినా కాస్త కాంపౌండ్‌లో ఉండమని బ్రతిమాలాడు. నాకు నవ్వాగదు. గుడ్లప్ప గించి నించుండిపోయాను. నుంచోకు తల్లీ! అలా కూర్చొని విశ్రాంతి తీసుకోవే అని కఠినంగా ప్రాధేయపడ్డ అన్నయ్యని చూస్తే జాలేసి పరుపుమీద చతికిలపడ్డాను.

చెప్పెయ్యాలనిపించింది, ఆ ఆవేశాల ఆరోపణలమధ్య — తీవ్రంగానే. ఓ రబ్బాయీ, మీకు మనస్తత్వం తెలీకపోగా శరీర తత్వం అసలే తెలీదు, మీరు నన్ను గురించనుకుంటున్నదంతా వొట్టిది; — అని ! — కాని నోరు పెకిలిరాదే ! — ఇంకా వీళ్ళని సస్పె న్స్‌లో పెట్టి చంపుదామనే శాడిస్టిక్ డిజైర్ వదల్దే ! —

• • •

## రామేశం

ఇది నిజమా? కమల ఇలా చేసిందా? ఆహా! ఆడవాళ్ళని నమ్మకూడదని మొదటిసారి అన్నవాడెంత గొప్పవాడు! వాడు ఈ పట్నాల్లో చదువులూ ఫేషన్లూ మరిగిన లేడీలని చూసి ఇంకా ఏం అనేవాడోకదా!

నిజానికి కమల—ది డిస్ట్రిక్ట్—ఎన్నిసార్లు తను నచ్చచెప్ప బోయాడు; పెళ్ళి అనేది నిర్ణయం అయితే చాలు, జరక్కపోయినా జరిగినట్టే అని!—తోసేసింది! ముట్టుకో నివ్వలేదు! ఆఖరికి—ఏరెణ్ణెల్ల క్రితం వుదంతం వాళ్ళు కేపిటల్ చేస్తున్నారో ఆ సందర్భంలో—వోసారి తను మహా నిర్భీతిగా తొందర పడితే—ఛీ, ఓసారి చెబితే మనిషివి కావా; ఈ మాత్రం దానికేనా ఢిల్లీ వెళ్ళి ఇంటర్వ్యూలు చేసి రావడం, శాస్త్రాలన్నీ కాచి వడబొయ్యడం—అని దులిపేసింది. ఎపాలకీ యిచ్చేదాకా మాట్లాడను పొమ్మంది.

ఎక్కడో ఏదో మిస్టేక్ జరిగింది! కమల ఘోరమైన అబద్ధం ఆడింది. ఇది సకారణంగా తెలుసుకొని ఎనలైజ్ చేసుకుంటే పెద్దగా కాంప్లిమెంట్ చేసుకోవచ్చును. ఎగ్రేట్ ఎఛీవ్ మెంట్.

పాపం, అమ్మ సంతోషిస్తోంది! ఛీఛీ.

• • •

## కమల

ఆవేదన ఎక్కువగా వున్నా కోపాలు పీకలు మునిగేటట్టున్నా, హాస్యరసం మట్టుకు జోరుగా, ధారాళంగా ఉత్పత్తి అయిపోతోంది—

తనకి స్వాతంత్ర్యం దీని అంతెంతవుతో చూడాలన్న నిర్ణయం బలపడి పోయింది—పాపం, అందరూ పేరు పేరు వరసని ఒచ్చి పలకరించి పోతున్నారు—ఇంట్లో కలిపెయ్యడం ఎంత మూర్ఖపు నిరోధమైనా చిరాగ్గానే ఉంది; కాని ఏదో థ్రిల్ల్ కూడా ఉంది, ఇందులో!—దగ్గిర కొచ్చిన వాళ్లని ముందుగా నేనే ముట్టుకొని కావిలించు కోవాలని అనిపిస్తోంది!

రామేశం బావ ఊసలాగా దూసుకొచ్చాడు గదిలోకి. ఢడాలున తలుపు వేశాడు. తలుపులు తియ్యి బావా, లేకపోతే తలుపు చాటునుంచి వినడానికి కన్నాల్లోంచి చూపులకీ అంతుండదు, అన్నాను. ఛీ, నీ వ్యవహారం తలుపు వెయ్యదగింది కాదు, తగిమి వెయ్యదగిందంటూ ప్రారంభించాడు. తలుపుతీసి, అందర్నీ పొమ్మంటేగాని నీ ఉపన్యాసం వినబోవడం లేదన్నాను నీకు ఉపన్యాసా లివ్వగల పశువు వేరే ఎక్కడో కాలరెత్తుకు భద్రంగా తిరుగుతున్నాడు. వాడి ఎడ్రసు తెలుసుకోలేకపోయిన చవటవి నువ్వు: నీ కన్నా వాడికన్నా వొట్టి చవటలం మేం అందరమూనూ, అన్నాడు. నీలో క్లియోపాత్రాకి జోహార్లన్నాడు.

నవ్వాను.

ఉరుములుకక్కి వెళ్ళాడు బావ. అలాగే ఇంటికి వెళిపోతా డేమిటి చెప్మా, ఇంట్లో మిగిలినవాళ్ళెవరితోటీ మాట్లాడకుండానూ, అని ప్రాణం కొట్టుకుపోయింది. నా చేత్తో బావకి కాఫీనీళ్ళు కూడా ప్రాప్తం లేకుండా చేసుకున్నాను... మేడమెట్లు దిగి హాల్లో అడుగు పెట్టాను—అశ్చర్యం! అత్తయ్యకూడా వొచ్చిందే!

మీ కందరికీ మతులుపోయా యన్నాడు బావ: లెక్చరింగ్

ధోరణిలో, మీ యింటికి రోజూ ఓ కుక్క వచ్చి అకార్యం చేసి పోతూ ఉంటే, మీ ఇంట్లో మరో కుక్క ఆ అకార్యం అనుభవించ డానికి సిద్ధంగావుంటే, మీలో యెవ్వరూ, అదేదీ గమనించలేకపోగా యిదంతా మామీద తోసేద్దామని చూస్తున్నారు: అని వెర్రివాడిలా అరుస్తున్నాడు బావ. అందరూ నిన్నటిదాకా పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్న వాళ్ళల్లా, యీ మాటలు విని బొమ్మలయి పోయారు... ఎంత తేడా?

ఇంక నే చేసేదేముంది?—ఈ సంబంధం దాటిపోతే — అందులోకి ఇలా దాటిపోతే ఇంక నాకు గుడిపాటి వెంకటచలం కూడా పెళ్ళి చెయ్యడు. ఏం చేస్తాం, నెలనెలా మూడేసి రోజులు కూచుంటున్నాను. ఈ నెల అయిదురోజు లవుతుంది మొత్తం. కానీ: ఇష్టమైన కష్టం కదా:

చిన్న వదినెగారూ ఆ చాప ఇల్లా పడెయ్యండి. ఒరే తమ్ముడూ కాసిని మంచినీళ్ళు తీసుకురారా దాహమౌతోంది. అన్నయ్యా నీ గదిలో కుటుంబరావు కథలని, ఓ పుస్తకం వుంది. తెచ్చియ్యవూ, సగంలో ఉండిపోయిందో కథా!— అన్నాను.

సివిల్ సప్లయిన్ వాళ్ళిచ్చిన బియ్యమూ, పరీక్షల పైత్యమూ, నిద్రలేకపోడమూ నాకు తెప్పించిన డోకులసంగతి—మీకు ఆశ్చర్యం వెయ్యడం లేదుగాని; మా వాళ్ళందరూ ఆశ్చర్యంలో మునిగారు; అది విని, ఒకవేళ నేను కాలు జారలేదన్న ఆనందాన్ని వాళ్ళు ఆశ్చ ర్యంగా ప్రకటించేరని నే ననుకొన్నానో, మరి; చెప్పడం కష్టం.

అందరికంటే ముందు అనుకున్నట్టుగానే అత్తయ్యే తేరుకుంది. చూశావురా నాయనా, వీళ్ళ ఎత్తు! ఇల్లాంటి ప్రమాదం జరిగిందన

గానే మనం కట్నం సంగతి ఎత్తకుండా ముహూర్తం పెట్టిస్తామని;—ఏం నాటకం ఆడేరో !—అన్నది.

అది పెద్ద అపవాదే. కాని విప్పడం, విప్పబోడం, చాలా ప్రమాదం.